



'కాకాణి' కోసం పోలీసుల ఆరా

లుక్ అవుట్ నోటీసులు జారీ



కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కదలికలపై పోలీసులు ఆరా పెట్టారు. హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన నేపథ్యంలో ఆయన విదేశాలకు వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. యాంటిసిపేటరీ బెయిల్ పిటీషన్ ఇంకా కోర్టు పరిధిలో ఉంది. ఈ తీర్పు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పది రోజుల నుంచి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులో లేరు. ఆయన హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు తెలిసింది. నిన్నటి వరకు బెయిల్ వస్తుందని ఎదురుచూసిన ఆయనకు చుక్కెదురు కావడంతో తదుపరి ఏం చేయాలనే విషయంపై కాకాణి ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. అవ సరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు సమాచారం. నెల్లూరు రూరల్ పోలీసులు విమా నాశ్రయాల్లో ఇమిగ్రేషన్ అధికారులకు కాకాణి సమాచారం చేరవేసినట్లు తెలిసింది. ఆయన కోసం నెల్లూరు రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నట్లుసమాచారం. కాకాణి మాత్రం ఎక్కడున్నారో ఇప్పటికీ ఎవరికీ తెలియడం లేదు.

సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు

◆సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

◆గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు, పెట్రోల్, డీజిల్ లీటరు ధర మరో రెండు రూపాయలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు ఎర్రటి ఎండలో ప్రజలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్‌సి సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా సుంకం పేరుతో తమ ఇష్టానుసారంగా ధరలు పెంచుతూ ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్నా యన్నారు.పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గింపు పై కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్ పై పెంచిన రూ.50 పెంపుదలను ప్రభుత్వమే భరించాలన్నారు.వివిధ రకాల భారాలతో అల్లాడుతున్న ప్రజలపై అదనపు భారాలు మోపడం తగదన్నారు. రాష్ట్రంలో ఉన్న అత్యధిక పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు దేశంలో మరే రాష్ట్రంలో లేవన్నారు. ఈ రాష్ట్రం కన్నా కర్ణాటకలో రూ. 10 తక్కువ ఉందన్నారు. తమిళనాడులో తమిళనాడులో రూ. 5 తక్కువ, కేరళ, తెలంగాణ మొదలగు రాష్ట్రాల్లో మన కన్నా తక్కువ ధరలు ఉన్నాయన్నారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ బి, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి నాగేశ్వరరావు, కె పెంచల నరసయ్య, అబ్దుల్ అజీజ్, నాయకులు పి సూర్య నారాయణ, బీసీ నరసింహ, మూలం ప్రసాద్, షేక్ వంషాద్, టి శివకుమారి, కత్తి పద్మ,షేక్ షాహిదబేగం, మాల కొండయ్య, షేక్ జాఫర్ చెంగయ్య, షేక్ ఫయాజ్, కె సురేష్, కే.వేమేలు, చిరంజీవి ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో సిపిఎం, సిఐటియు ,ఐద్వా ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ,పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని స్థానిక సుందరయ్య భవన్ నుండి ఆర్టీసీ డిపో వరకు గురువారం ప్రదర్శన జరిగింది. ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ ఎస్ఏ గౌస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను విపరీతంగా పెంచిందన్నారు. పెట్రోలు, డీజిలు సుంకాలను పెంచిందని ఈ విధానాల వల్ల ప్రజల మీద అధిక భారం పడ తుందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకులు ఎస్.కె ముస్తార్ సుల్తానా ,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ని మల్లిక ,ఎం పద్మ, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్ పవన్ కుమార్, సిఐటియు నాయకులు బి శీను, డిఎం రాయుడు, గిరిజన సంఘం నాయకులు రమణ, పేతురు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

12న ఆశా వర్కర్ల జిల్లా సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఈ నెల 12వ తేదిన 'ఆశా వర్కర్స్ యూనియన్ సాధించిన విజయాలు. ఎదుర్కొంటున్న సవాళ్లు' అన్న అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అన్నపూర్ణమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తియిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హాజరౌతారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆశా వర్కర్లు అందరూ అధిక సంఖ్యలో ఈ సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి పిలుపు నిచ్చారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా శాఖ వారు రూపొందించిన "ప్రభుత్వ పాఠశాలలలో మీ పిల్లలను చేర్పించండి.వారి బంగారు భవితకు బాటలు వేయండి" పోస్టర్ ను కలెక్టర్ ఆనంద్,జాయింట్ కలెక్టర్ కార్తీక్,సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్క రించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పేదల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు :సమాజంలో అట్టడుగున ఉన్నవారి సమస్యలను పరిష్కరించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ లతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 6,400 వినతలు అందాయన్నారు. ఇందులో 2, 582 వినతులు ప్రతి బుధవారం తాము నిర్వహించే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చినవని వివరించారు. సర్వేపల్లి నియోజ కవర్గంలో నోరులేని గిరిజనులు అనేకమంది ఉన్నారని వారిలో అర్హతలు ఉండి కూడా పెన్షన్లు, ఇళ్ళు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. వారికి సత్వరమే ఆధార్ కార్డులు అందించి తద్వారా సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

తహశీల్దార్లకు సూచనలు

కలెక్టర్ రెవిన్యూ సమస్యలను అర్జీల వారీగా పరిశీలించి సంబంధిత తహసిల్దార్లకు తగు ఆదేశాలు జారీజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలోగా అర్జీలను పరిష్కరించాలని తహసిల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. భూ సంబంధ సమస్యలను ఆంధ్రప్రదేశ్ ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసులను గమనంలోకి తీసుకొని నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. డిఆర్ఓ ఉదయ్ భాస్కర్, ఆర్డీఓ అనూష, జెడ్పి సి ఇ ఒ విద్యా రమ, డి యం హెచ్ ఒ సుజాత, సమగ్ర శిక్ష ఎపిఒ వెంకట సుబ్బయ్య, డిపిఒ శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి గంగా భవాని, సర్వేపల్లి నియోజకవర్గంలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలుపాల్గొన్నారు.

ఎస్‌పి కృష్ణకాంత్‌కు అస్వస్థత

ప్రజాశక్తి-నెల్లూరు :ఎస్‌పి జి.కృష్ణకాంత్ తీవ్రమైన అస్వస్థతకు గురికావడంతో పోలీసు సిబ్బంది హుటాహుటిన నగరంలోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాల యంలో ఉన్న సమయంలో ఆ ఘటన చోటు చేసుకుంది.ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆయన ఉన్నారు. ఎస్‌పి ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



బుర్రాకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భూములను పరిరక్షించండి..

ప్రజాశక్తి-కందుకూరు :ఉలవపాడు మండలం, కరేడులో ఇండోసోల్ ప్రాజెక్ట్ కోసం భూముల సేకరణ చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడతారని, కరేడు గ్రామ రైతులు కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్ర మధుసూదన్ యాదవ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. భూముల సేకరణకు సంబంధించి రైతులతో మాట్లాడకుండా నిర్ణయం తీసుకుని తమ భూములు లాక్కుంటున్నారని ఆయన దష్టి కి తీసుకువచ్చారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని పరకండపాడు గ్రామంలో మంచినీటి బోరు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తిందని ప్రజాశక్తి కథనంలో ప్రచురితమైంది. దీంతో సమస్యను తెలు సుకున్న వెంటనే ఆర్డబ్ల్యూఎస్ .ఎ. ఈ. సాగర్, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు పరకంతపాడు సర్పంచ్ తో కావలసిన సామాగ్రి మొత్తం పంపించి మర మ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ సర్పంచ్ కోలా కొండయ్య. బోరు మెకానిక్ బ్రహ్మయ్య ఉన్నారు.

పేదలకు చేయూత

ప్రజాశక్తి-కందుకూరు :శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే నిరాశ్రయులకు, యాచకులకు ఈ వేసవి కాలం సందర్భంగా వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు గురువారం పంపిణీ చేశారు. కోదండ రామాలయ దేవస్థానం అధ్యక్షులైన మురారిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రవ్వా శ్రీనివాసులు నిస్వార్థముతో సేవ చేయాలనే ఉద్దేశంతో పేదవారికి అవస రమైన వివిధ రకాల సేవలను అందిస్తున్నారన్నారు. వేసవిలో నేపథ్యంలో వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం ఎంతో



మంచి కార్యక్రమం అన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవారత్న డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ పట్టణ కోశాధికారి కొత్తూరి వెంకట సుధాకర రావు,గుర్రం చిన్న అల్లూరయ్య పాల్గొన్నారు.



మద్దాలి బాబులుని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

ఎంఎల్ఎ 'ఇంటూరి' పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు మద్దాలి రామకష్ణ తండ్రి బాబులు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొంది చందానగర్ లోని వారి నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం రామకష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పోషకాహారం మాసోత్సవాలు



గుడ్లూరు రూరల్..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు 1 సెక్టారులో ఉన్న పరకంతపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పౌష్టికాహార మహోత్సవాలను గుడ్లూరు -1 సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, సిడిపిఒ అరుణ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్త పద్మజ నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులు, చిన్నారులు, తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సర్పంచ్ కోలకొండయ్య, పద్మజ పాల్గొన్నారు.

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో తేట్టు సెక్టారులోని మోచర్ల గ్రామంలో ని అంగన్వాడి కేంద్రంలో జాతీయ పౌష్టికాహార మహోత్స వాలను తేట్టు సెక్టార్ సూపర్‌వైజర్ కామేశ్వరి, సిడిపిఒ అరుణ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు సి.హెచ్ .వరలక్ష్మి. ఏ .కొండమ్మ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి ఏ .కొండమ్మ పాల్గొ న్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు :ఏడో జాతీయ పౌష్టికార మహోత్సవాల సందర్భంగా గుడ్లూరులో మరియమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వినియోగంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసు కోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భవతులు బాలింతలు చిన్నారులు పాల్గొన్నారు

ప్రజాశక్తి- లింగసముద్రం :మండలంలోని పెద్దపవని అంగన్వాడి సెక్టార్ పరిధిలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బాలింతలకు గర్భిణీలకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ నీలాంబరి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. పోషకాహారం పై అవగాహన కల్పించారు. పాలు,గుడ్లు, ఆకుకూరలతో పాటు పౌష్టికాహారాన్ని సమపాలనలో తీసుకు న్నప్పుడే బాగుంటుందని చెప్పారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.



నెల్లూరులో..

నెల్లూరు :నెల్లూరు నగరంలోని నవాబుపేట సెక్టార్ పరిధిలోని రామచంద్రపురం, కామాటీ హరిజన వాడఅంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెక్టార్ సూపవైజర్ లక్ష్మీ రాజ్యం పాల్గొని వెయ్యి రోజుల సంరక్షణ గురించి అంటే గర్భిణి అయిన మొదలుకొని బిడ్డ రెండు సంవత్సరాల పూర్తయ్యేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల,సంరక్షణ గురించి వివరించారు. అంగన్వాడి కార్యకర్తలు ఉమామహేశ్వరి ,రజనీ,సుదర్శన, ఏ.సునీత,యన్. సునీత,జి.సునీత ,లలితా కుమారి, ఆయాలు అనుష, రాజేశ్వరమ్మ, టీ.గోపమ్మ పాల్గొన్నారు.



లింగసముద్రంమండలం, పెద్దపవనిలో..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు :క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవోలతో కలిసి రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలపై కూలంకషంగా చర్చించారు. పలు పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు, ప్రైవేటు పట్టా భూములను నిషేధిత 22ఎ నుంచి తొలగించుట, రీసర్వే సమస్యలు, అభ్యంతరం లేని ప్రభుత్వ భూ ముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ, వెబ్‌ల్యాండ్‌లో ఎదువుతున్న సాంకేతిక సమస్యలు, అసైన్‌మెంటు భూముల కేటాయింపు, మ్యూటేషన్లు, పివోటి, ఇనాం యాక్ట్‌ల వర్తింపు, భూముల రిజిస్ట్రేషన్‌లో తలెత్తు తున్న సమస్యలు, చట్టపరంగా భూసమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న పలు అంశాలను తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ అధికారులు సూచించిన ప్రతి సమస్యపై కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ సుదీర్ఘంగా చర్చించి పరిష్కారానికి తగు సూచనలు చేశారు. చట్ట పరంగా, సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలను రెవెన్యూ చట్టాలకు లోబడి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా సర్వేల్యాండ్ రికార్డుల ఎడి నాగశేఖర్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్‌డిఒలు అనూష, వంశీకష్ణ, పావని, తహశీల్దార్లు, డిటిలు, ఆర్‌ఐలు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక పొదలకూరురోడ్డు, సారాయి అంగడిసెంటర్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ప్రగతి నగర్ ఏ బ్లాక్ 10వ వీధి అడ్డరోడ్డు ప్రాంతంలో మసీదు సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో నివాముంటున్న దుద్దోలు వాసు (21)ను గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. వాసు మృత దేహాన్ని నిందితులు సమీపంలోని చెరువు సమీపంలో చెత్త వేసే ప్రాంతం వరకు లాక్కొని పోయి చెత్తలో వదిలి వెళ్లారు. రహదారిపై మృత దేహాన్ని లాక్కొని వెళ్లే సమయంలో ఏర్పడిన రక్తపు మరకలను నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు గుర్తించడమే కాకుండా సమీపంలో చెత్త వేసే ప్రాంతంలో మృత దేహం పడి ఉండటాన్ని గుర్తించి వెంటనే ఐదో నగర పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సిఐ రోశయ్య ఐదవ నగర పోలీసు స్టేషన్ పరిధిలో యువకుడు హత్యకు గురైనట్లు నగర డిఎస్‌పికి సమాచారం అందజేసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పామూరు ప్రాంతానికి చెందిన వాసు కుటుంబ సభ్యులు గడిచిన కొంత కాలం కింద నగరానికి వచ్చారని, మృతుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండే వారని,వ్యసనాల కారణంగా ఇటీవలకొందరితో ఘర్షణలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి తండ్రి నగరంలోని ఓ వైద్యశాల సెక్యూరిటీ గార్డుగా పనిచే స్తున్నట్లు పోలీసు విచారణలో తెలిసింది. ఈ హత్య కేసు దర్యాప్తు నిమిత్తం ఉన్నతా ధికారులు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ హత్య ఘటనలో తొమ్మిది మంది పాల్గొన్నట్లు గుర్తించారు. వారిలో ఐదుగురు నింది తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు పోలీసులు భావించి వెంగళరావునగర్ ప్రాం తానికి చెందిన ఒక వ్యక్తి కంచెర్ల బాలమణికంత, జె.వి.ఆర్ కాలనీకి చెందిన నల్లమేకల సంతోష్, బుజబ ుజనెల్లూరు ప్రాంతానికి చెందిన గాలి వెంకట తేజ, సారాయి అంగడి సెంటర్, ప్రగతి నగర్ ప్రాంతానికి చెందిన కాకర్ల వినయ్, బుజ బుజనెల్లూరు ప్రాంతానికి చెందిన యెద్దుల ఛత్రపతి అను వారిని అదుపులోకి విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది.



దద్దోలు వాసు (ఫైల్)

నెల్లూరులో వడ్డెర సంఘం రాష్ట్ర మహాసభలు

జూన్ 7,8 తేదీల్లో నిర్వహణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు నగరంలో జూన్ 7,8 తేదీల్లో ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ తెలిపారు. గురువారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం చల్లా వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పాల్గొని మాట్లాడుతూ నెల్లూరు నగరంలో జూన్ 7,8 తేదీల్లో జరుగు ఏ.పి.వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర మహిళల పై అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వాటిని అరికట్టడానికి వడ్డెరలకు ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి వడ్డెర్లకు, వడ్డెర వృత్తిదారులకు రక్షణ కల్పించాలని, వృత్తి రీత్యా మరణించిన వారికి 25 లక్షలు ఎక్స్ గ్రేష్‌యో ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృత్తులలో నైపుణ్యత పెంచేదానికి ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చదువుకున్న యువతీ యువకులకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఉన్నత చదువులు చదువుకోడానికి అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ,జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి వర్యులు నారా లోకేష్ సభలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. మధురైలో జరిగిన సిపిఎం జాతీయ మహాసభలకు తిరుపతికి చెందిన చల్లా వెంకటయ్య తిరుపతి నుండి మధురై కు 550 కి.మీ ఏడు రోజులు సైకిల్ యాత్ర లో పాల్గొన్నారు. ఆయనకు సమావేశంలో రెడ్ శాలువాతో మల్లి నాగార్జున సన్మానించారు.కార్యక్రమంలో వెంకటయ్య, రత్తయ్య, గుంజి ఖాసీం, వెంకటరమణయ్య, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంజి దయాకర్

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల కు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, కష్ణపట్నం హైదరాబాద్ పైప్ లైన్ ప్రాజెక్టు వారు గ్రీన్ బోర్డ్స్, కలర్ ప్రింటర్, ఫ్యాన్స్ ,కుర్చీలు అందజేశారు. ప్రాజెక్ట్ లీడర్ ఉమా రాణి మాట్లాడుతూ మా ద్వారా ఈ పాఠశాలకు కావలసిన వాటిని ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది ఎందుకంటే ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు దివ్యాంగుడైన పాఠశాల అభివద్ధికి ప్రత్యేక కషి చేస్తున్నారని అభినందించారు. సీనియర్ మేనేజర్ ప్రమోద్ కష్ణణ్, మేనేజర్ నరసింహారావు, అసిస్టెంట్ మేనేజర్ బీమ్లా నాయక్, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర రావు విద్యార్థులు పాల్గొన్నారు


హైస్కూల్లో మౌలిక వసతులు

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్

మండల కేంద్రంలో జెడ్‌పిహెచ్ స్కూల్లో చదువుకునే విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.ల్యాబ్‌లు, గ్రంథాలయం, కిచెన్ గార్డెన్ తదితరాలు ఏర్పాటుచేస్తున్నారు. స్కూల్ ప్రాంగణంలో ఆటలకు అనుకూలంగా కోర్టు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.13 లక్షల పిఎం శ్రీ నిధులు వెచ్చించి కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం రూ. 19 లక్షల తో గ్రంథాలయ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నారు. రూ. 4.25 లక్షలతో గ్రౌండ్ ట్రాక్, ఖోఖో, కబడ్డీ, క్రీడా ప్రాంగణాల అభివద్ధికి ఖర్చు చేస్తున్నామని,విద్యార్థులకు భోజన వసతిలో భాగంగా కిచెన్ గార్డెన్ ను నిర్మిస్తు న్నామని. భవిష్యత్తులో పిఎం శ్రీ నిధులతో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేస్తామని, ఈ పథకం అమల్లో భాగంగా పాఠశాల విద్యా ర్థులకు మౌలిక వసతులు సమకూ ర్చబడ తాయ నిప్రధా నోపాధ్యా యులు రామ్మోహన్ తెలిపారు. నాణ్యమైన విద్య బోధనకు ఐ. ఎఫ్. పి. ద్వారా అత్యాధునిక పద్ధతులలో బోధన జరుగు తుందన్నారు. గత నాలుగేళ్ల నుంచి నిర్మాణం పూర్తికాని ఎనిమిదో తరగతి గదులు నిర్మాణం పూర్తి చేసుకొని అందుబాటులోనికి వచ్చాయన్నారు.ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించి. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కూడిన బోధన సౌలభ్యతను పొందాలని రామ్మోహన్ కోరారు.



హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన అభివృద్ధి పనులు


నివాళులర్పిస్తున్న నాయకులు

కుడుముల రోశయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని గండవరం గ్రామం సిపిఎం శాఖా కార్యదర్శి కుడుముల రోశయ్య (55)ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, తిరకాల దయాకర్, నాయకులు గోనె దయాకర్ గ్రామంలో సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సిపిఎం మండల కమిటీ సభ్యుడిగా, గ్రామ శాఖ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం సమస్యలపై ఆ గ్రామంలో పేదల పక్షాన నిలబడి పనిచేశారని కొనియాడారు. ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాంతారావు, నరసయ్య, ఎస్‌కె మాబూ, దేవానందం, బాలకృష్ణ, గండవరపు శేషయ్య, తలారి నరసింహం, మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యానాదులకు ఆధార్‌కార్డులు ఇవ్వకపోవడం అన్యాయం

ప్రజాశక్తి-కావలి: యానాదులకు ఆధార్‌కార్డ్ ఇవ్వకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు.గురువారం దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో కావలి తహశీల్దార్. జి. శ్రావణ్ కుమార్‌ను కలిసి ఆదార్ కార్డుల సమస్యపై వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ కావలి డివిజన్‌లో దాదాపు 500మందికి పైగా యానాదులకు ఆధార్‌కార్డు లేక సంక్షేమ పథకాలు లేక ప్రభుత్వం నుండి వచ్చే బియ్యం, పెన్షన్లు చాలా వరకు యానాదులకు రావడం లేదని తెలిపారు. గ్రామానికి 10మందికి చొప్పున ఆధార్ లేకుండా పోయిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ దష్టికి తీసుకొని రాగా తక్షణమే యానాదుల ఇళ్ళకు తిరిగి సూచించిన పేర్లతో నమోదు చేసి తక్షణమే యానాదులకు ఆదార్‌కార్డులు ఇస్తామని తెలిపారు. శుక్రవారం నుండి ఆదార్‌కార్డులు లేని వారిని తీసుకొని వస్తే ప్రత్యేక డ్రైవ్ కింద అందరికి ఆధార్‌కార్డులు వచ్చే విధంగా ప్రయత్నిస్తామని సంక్షేమ పథకాలు వచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. యానాదులతో పాటు జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, జె శ్రీనివాసులు, పాల్గొన్నారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించండి

ప్రజాశక్తి-సీతారామపురం

పట్టణంలోని పడమట వీధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతి విద్యార్థులను మరొక పాఠశాలకు బదలాయించే ప్రక్రియను నిలుపుదల చేసి యథావిధిగా కొనసాగించాలని పడమట వీధి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. జనసేన మహిళా నాయకురాలు భోగినేని సులోచనమ్మ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఇఒ మస్తాన్ వలీకి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం భోగినేని సులోచనమ్మ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-సీతారామపురం

సీతారామపురంలోని పోస్ట్ ఆఫీస్ వీధిలో గుజ్జుల శ్రీనివాసులు నివాసముంటున్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తీవ్ర ఆస్తి నష్టం జరిగిందని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జనసేన మహిళా నాయకురాలు భోగినేని సులోచనమ్మ ఆధ్వర్యంలో బాధిత కుటుంబం తహశీల్దార్ జి.కృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భోగి నేని సులోచనమ్మ మాట్లాడుతూ జీవనోపాధి కోసం తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ పిల్లలని చదివించుకుంటూ బాడుగ ఇళ్లలో నివాసముంటున్న నిరుపేద కుటుంబమైన గుజ్జుల శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటున్న ఇంట్లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని, కూలి పనులు చేసుకుంటున్న నిరుపేదలైన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తహశీల్దార్‌ను కోరారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి

తలసేమియా బాధిత చిన్నారుల ను ఆదుకునేందుకు తమకళాశాల విద్యార్థులు రక్తదానం చేస్తున్నట్లు శ్రీ లక్ష్మీ కాలేజీ ఆఫ్ మెడికల్ లైసెన్స్ సెక్రటరీ, కరెస్పాండెంట్ డాక్టర్ కె మాధవరెడ్డి తెలిపారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ కావలి ఆధ్వర్యంలో కావలి పట్టణం పాతవూరులోని శ్రీ లక్ష్మీ కాలేజీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కావలి రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్ లో చికిత్స పొందుతున్న చిన్నారులకు వ్యాధి తీవ్రతను బట్టి 15 లేదా 21 రోజులకు ఒకసారి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు, మందులు, పౌష్టిక ఆహారం అందజేస్తారన్నారు. వేసవి కారణంగా రక్తకేంద్రంలో రక్తనిల్వలు అడుగంటాయని, ఈ విషయం తెలుపగానే తమ కళాశాలలో నర్సింగ్, ఫిజియోథెరపి చదువుతున్న విద్యార్థులు రక్త దానం చేయడానికి ముందుకు వచ్చారని పేర్కొన్నారు. తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణకు ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఎ), రోటరీ క్లబ్ లు సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరంలో 31 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో 43వ సారి రక్తదానం చేసిన డాక్టర్ కె మాధవరెడ్డిని బి.ఎస్.ఎన్.ఎల్. క్రాస్ వైస్ చైర్మన్ కె హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన రావు, రోటరీ క్లబ్ ఆఫ్ కావలి కార్యదర్శి మొగల్ సలీం బేగ్‌లు అభినందించారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడు గ్రామానికి మాజీ శాసనసభ్యులు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ గురువారం ఒక ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు కలసి వినతి పత్రం సమర్పించారు. మా గ్రామానికి సంబంధించినటు వంటి భూములను సోలార్ కంపెనీ వారికి భారత్ పెట్రోలియం పరిశ్రమల వారికి కట్టబెట్టే విధంగా ఈనెల 25వ తేదీన జీఓ జారీ చేసినందున 11,500 ఓట్లు కలిగిన అతి పెద్ద పంచాయతీ అయిన కరేడు గ్రామం చిన్నా భిన్నమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురై భూములు కోల్పోయి పరిశ్రమల వలన పొల్యూషన్ ఏర్పడి రోగాలకు గురవుతారని ప్రజలు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీగా మీరు ప్రజా ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని మద్దతు కల్పించాలని శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాను వ్యవహరిస్తానని ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉన్నానని మధుసూదన్ యాదవ్ తెలిపారని శ్రీనివాసులు తెలిపారు.

రాజకీయ పార్టీ నేతలతో సమీక్ష.

ప్రజాశక్తి-ఉదయగిరి

నియోజకవర్గంలోని రాజకీయ పార్టీ నేతలు 8మండలాల తహశీల్దార్ల తో గురువారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఎం.సుభద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓట్లు మార్పులు చేర్పులు తొలగింపులు, చనిపోయిన వారి పేర్లు తొలగింపులు వంటి అంశాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని పలు పార్టీ నాయకులను కోరారు. పోలింగ్ స్టేషన్లో ఏమైనా అభ్యంతరాలున్నా తెలియజేయాలని సూచించారు. అనంతరం పట్టణానికి చెందిన పలు స్టేషన్లో మార్పు చేయాలని మరికొన్ని ప్రాంతాల్లో నూతన బూత్‌లను ఏర్పాటు చేయాలని టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్ బయన్న తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో కొన్ని పంచాయతీలు బూత్‌లు మార్పులు వేర్వేరు చోట్ల ఉన్న ఓటర్లను దగ్గర ఉన్న బూత్‌లలో కుటుంబాల వారిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఆరోగ్య కేంద్రానికి గ్రహణం'..

..నిధులున్నా నిర్లక్ష్యమెందుకో..
..అద్దె భవనంలో ఆరోగ్య కేంద్రం
.. అధికారి నిధుల గోల్‌మాల్‌పై అనుమానం

ప్రజాశక్తి- బుచ్చిరెడ్డిపాళెం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రహణం పట్టింది.. నిధులున్నా ఆరోగ్య కేంద్రం ఇప్పటికీ తెరు చుకోలేదు...కేంద్రం నిధులు విడుదల చేసినా ఓ అధికారి తన సొంత ఖాతాల్లో జమచేసిన నగదును పక్కదారి పట్టించారనే ఆరోపణ లున్నాయి..కోట్ల రూపాయ లతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మిగిలిపో యాయి.. ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని భవనం ప్రారంభించి, పేదలకు ఆరోగ్య సేవలందించి చూడాలని బుచ్చి ప్రాంత ప్రజలు కోరుతున్నారు...



కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లాలోని అన్ని నగర పంచాయతీలకు 28 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) 2021 లో మంజూరయ్యింది. ఈభవన నిర్మాణానికి కోటి 10 లక్షల రూపాయలు నిధులు బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీకి మంజూరయ్యాయి. అప్పటి స్థానిక శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తొలి విడతగా విడుదలైన 80 లక్షల రూపాయల నిధులతో భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ఈ మేరకు గుత్తేదారులకు బిల్లులు సైతం చెల్లించారు. మిగిలిన పనుల నిమిత్తం 30 లక్షల రూపాయల నిధులు గత సార్వత్రిక ఎన్నికల సమయంలో నగర పంచాయతీ కమిషనర్ ఖాతాకు విడుదలైనట్లు సమాచారం. అప్పటినుంచి భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆస్పత్రి ప్రహరీ గోడ లోపల విద్యుత్ ప్లంబింగ్, నీళ్ల మోటార్, తదితర పనులు నిలిచిపోయాయి . అప్పటి నగర పంచాయతీ కమిషనర్ ఖాతాకు విడుదలైన 30 లక్షల రూపాయల నిధులు దారి మళ్లినట్లు, దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. గుత్తేదారు పనులను జరగకుండా నిలిపివేశారు. ప నులు పూర్తి చేస్తే తమకు బిల్లులు రావేమో నని అనుమా నంతో సదరు గుత్తేదారు పనులను నిలిపివేసినట్లు తెలిసింది. ఆసుపత్రి నిర్మాణం పూర్తయి అక్కడ ఉండి సేవలందించాల్సిన వైద్యాధి . కారి, ఇతర సిబ్బంది బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో ఓ అద్దె భవనంలో ఉండి వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. ఈ భవన నిర్మాణమై ఇటీవల రాష్ట్రస్థాయి అధికారుల సైతం ఇక్కడి స్థానిక అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఇక్కడ విధులు నిర్వహించిన నగర పంచాయతీ కమిషనర్ రమణ బాబును ప్రస్తుత కమిషనర్ బాలకృష్ణను ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారిరువురూ అందు బాటులోకి రాలేదు. ఈ ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆ స్థలంలో ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయని తెలిసింది. స్థానిక శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవ తీసుకొని భవన నిర్మాణం పూర్తి చేయించి వైద్య సేవలు ప్రజలకు అందేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుచున్నారు.



పాలిటెక్నిక్‌ను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-కావలి.: ఆర్జేడీ (ఆర్.జే.డీ) ఎ.నిర్మల్ కుమార్ ప్రియా, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రీజియన్, తిరుపతి నుండి గురువారం విచ్చేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కావలి కళాశాలను సందర్శించారు. ఉదయం (ఎఫ్ ఎన్) కళాశాలలో పరీక్షలను తనిఖీ చేసి తదనంతరం పాలీసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు పాలిసెట్ (పాలీసెట్) 2025 కి సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.పాలిసెట్ 2025 ప్రవేశ పరీక్ష కోసం అవసరమైన స్టడీ మెటీరియల్ రేపు విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో నడుస్తున్న ఉచిత శిక్షణ బ్యాచ్‌కు పంపిణీ చేయబడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఇంకా, పాలిసెట్ 2025 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 15-04-2025 అని తెలిపారు. దరఖాస్తు ఫీజు: ఓ సి/బీసీ విద్యార్థులకై రూ.400/- మరియు ఎ స్సీ/ఎ స్టి విద్యార్థులకై రూ. 100/- మాత్రమే.ప్రస్తుతం కావలి సౌత్ ప్రాంత విద్యార్థుల కోసం విశ్వోదయ బాలికల పాఠశాలలో మరియు కావలి నార్త్ విద్యార్థుల కోసం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి: ఏప్రిల్ 25,26, 27వ తేదీల్లో శిక్షణ తరగతులు ఇందుకూరుపేటలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షులు ఓ ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ప్రయత్నంలో వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిర్వహించే జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఏప్రిల్ 25,26, 27వ తేదీల్లో శిక్షణ తరగతులు ఇందుకూరుపేటలో జరగనున్నాయని తెలిపారు.

మహమ్మద్ హుస్సేన్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసి ఉన్న పేట దర్గాలో ఇఒగా పనిచేస్తున్న మహమ్మద్ హుస్సేన్ స్థానిక ముస్లిం సోదరులు సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పవిత్ర రంజాన్ మాసంలో భక్తుల కోసం ప్రత్యేక చొరవ చూపి ఏర్పాట్లు చేసినందుకు గాను, వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఈవో తో పాటు, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ఖుదావన్, అకౌంటెంట్ ఖాజా హుస్సేన్ ను దుశ్శాలువులను కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ రఫీ, సయ్యద్ జమీల్, సయ్యద్ ఆబిద్, మహమ్మద్ షకిల్, సయ్యద్ గౌస్ బాషా, సయ్యద్ నయీమ్, షేక్ ఖలీల్, సయ్యద్ రహ్మత్ నవాజ్, జంషీద్, మోబిన్, షేక్ ఫరీద్, పఠాన్ ఇర్ఫాన్ లు ఉన్నారు.

అవకతవకలపై విచారణ చేయండి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలోని కావలి ఎడవల్లి గ్రామ కాపురస్తుడు జనసేన పార్టీ నాయకుడు ఉల్లగంటి శ్రీనివాసులు రేషన్ డీలరు చేస్తున్న అవకతవకలపై విచారణ చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కావలి ఎడవల్లి రేషన్ షాపు డీలర్ అయిన పొన్నూరు రమేష్ అను వ్యక్తి మా గ్రామంలో నివాసం ఉండడం లేదన్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్నాడు. సరుకులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. అందుబాటు లేని ఈ డీలర్ ను తొలగించి ప్రజలందరకు అందుబాటులో ఉండే వారిని నియమించాలని పత్రిక ముఖంగా వేడుకున్నారు. తహశీల్దార్‌ను ఈవిషయంపై ఫోన్ లో వివరణ కోరగా విచారణ చేస్తామని తెలియజేశారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ 43వ బూత్ లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ పి. చెంచల బాబు యాదవ్ పంపిణీ చేశారు. ఈ గురువారం స్థానిక అరుంధతీయపాలెంలో మండల టిడిపి కన్వీనర్ బయన్న ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నల్లిపోగు రాజా సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గం లో దాదాపు 90వేల సభ్యత్వ నమోదు చేశామన్నారు.దాదాపు 10వేల సభ్యత్వాలు టిడిపి కుటుంబ సభ్యులు అభిమానులు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా కింద 5 లక్షల రూపాయలు ఇవ్వబడుతుందన్నారు. శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉదయగిరి టూరిజం, పరిశ్రమలు తీసుకొని రావడానికి అన్ని విధాలుగా కృషి రాబోయే రోజుల్లో నియోజకవర్గం, పట్టణం అభివృద్ధి బాటలో నడుస్తుందని ఉదయగిరి ప్రజలు ఆశాభం వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం సభ్యత్వం తీసుకున్న వారికి ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ ఐ టి డి పి, వాణిజ్య విభాగం అధ్యక్షులు షేక్ రసూల్, దర్శి హరికృష్ణ, ఎక్స్ ఎంపీపీ రవీంద్రబాబు, ఎక్స్ మండల కన్వీనర్ బొజ్జా నరసింహులు, మాజీ సర్పంచ్ కుమ్మిత రమణారెడ్డి, ఐ టి డి పి సభ్యులు శివ పాల్గొన్నారు.


కార్డులు అందజేస్తున్న దృశ్యం

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-కోవూరు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా తెలిపారు. మండలంలోని ఇనమడుగు పంచాయతీ కొత్త దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారం పక్షోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు బాల సంజీవని కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇ వ్వాలన్నారు. 6 నెలల తర్వాత పిల్లలకు ఇచ్చే అనుబంధ పౌష్టికాహార పద్ధతులపై బాలింతలు మరింత అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈ. సుప్రజ ఎల్, కామాక్షి, ఆశా కార్యకర్త పద్మ, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడు సెక్టార్ లోని ఇందిరానగర్ కాలనీ, ఉలవపాడు-1 అంగన్వాడి కేంద్రాలలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సిడిపిఓ అరుణ ఆదేశాల మేరకు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. నాగలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారం, వైవిధ్యం, కేవలం తల్లిపాలు ఇవ్వడం వలన పొందవచ్చు అని తెలిపారు.కార్యక్రమంలో ఉలవపాడు సెక్టర్ సూపర్‌వైజర్ కే. అంజమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి

ఐ.సి.డి.ఎస్.ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సమాజంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకారంతోనే ఆరోగ్యం గా ఉంటారని లింగ నిర్ధారణ నిషేధ చట్టం కావలి డివిజన్ కమిటీ సభ్యులు ఎం. మాలకొండరెడ్డి తెలిపారు.బాలకృష్ణారెడ్డి నగర సచివాలయం ఆవరణలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యం లో పోషకార పక్షోత్సవాలను నిర్వహిం చారు. 16వవార్డు అధ్యక్షులు ఇ.మాల్యాద్రి 129 ఇన్‌ఛార్జి ఎం. శివ కుమార్ గౌడ్,130 వ బూత్ ఇన్‌ఛార్జి రమణయ్య, ఉపాధ్యక్షులు షేక్. బాబ్జి, వార్డుపెద్దలు ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిడ్నీ డయాలసిస్ పేషెంట్‌కు బెడ్ వితరణ

ప్రజాశక్తి-కావలి: హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం కిడ్నీ డయాలసిస్ పెషేంట్ కు అవసరమైన బెడ్ ను వారి తమ్ముడు షేక్. మస్తాన్ కు వెంగళరావు నగర్ లో గల ప్రసాద్ రావు దాతృత్వంతో వారి స్వగృహంలో అందజేశారు.ఈసందర్భంగా హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా మాట్లాడారు.కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనిబాషా, గౌరవ అధ్యక్షులు షేక్. ఖాదర్ బాషా, ఉపాధ్యక్షుడు విజయ్. దేవరకొండ, జాగో సేవా సంస్థ అధ్యక్షులు షేక్. జమీర్, రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం. వి. ఎస్. ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశ మరణాలు నివారించాలి

ప్రజాశక్తి-కావలి.: సమాజంలో తల్లి బిడ్డలను సంరక్షించి మాత శిశు మరణాలను నివారించాలని కావలి ఎంపిడిఒ సిహెచ్. శ్రీదేవి తెలిపారు. గురువారం వెంగళ రావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఎం. మహేష్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా 9 వ తేదీన వైద్య పరీక్షలు చేయించుకొని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని కోరారు.కావలి డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ చట్టం కమిటీ సభ్యులు ఎం. మాలకొండారెడ్డి మాట్లాడుతూ భ్రూణ హత్యలు నివారించాలని కోరారు. డా " రామ్ సెంటర్ చైర్మన్ డి. మనోహర్ రెడ్డి ఉచితంగా ఐరన్ సిరప్ లను అందచేశారు. కార్యక్రమంలో ఎస్ యు ఓ. టి లక్ష్మి నరసయ్య, సూపర్‌వైజర్ సుగుణ, సి ఓ. ప్రసాద్, ఆశాలు,ఏ.ఎన్.ఎం.లు పాల్గొన్నా రు.

విద్యార్థులు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

ప్రజాశక్తి-కావలి. విద్యార్థులు తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చేలా అత్యున్నత శిఖరాలు అధిరోహిం చాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి పట్టణం గాయత్రి నగర్ లోని నలంద పాఠశాలలో గురువారం 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చదువు పై శ్రద్ధ పెట్టి ఇష్టంగా చదువుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలో కష్టపడితే, తదుపరి జీవితం సుఖమయం అవుతుందని తెలిపారు. ఎంతమంది స్నేహితులు ఉన్నా సరే, ఒక మంచి మిత్రుడిని సంపాదించుకోవాలని తెలిపారు. విద్య ఆవశ్యకత, గురువుల గొప్పతనాన్ని ఆయన వివరించారు.విద్యార్థులకు ఆశీస్సులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే తిలకించారు. పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ మజహర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి: ప్రకృతి వ్యవసాయం తోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటామని తహశీల్దార్ ఎం.సుభద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారంస్థానిక స్త్రీ శక్తి భవన్ లో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రైతు సాధికార సంస్థ ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సాధించాలని కోరారు. కార్యక్రమంలో సిడిపిఓ సునీత ఏపిఎం ఖాజా రహమతుల్లా వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, హార్టికల్చర్ అధికారిని జయశ్రీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి-బిట్రగుంట: కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈనెల 14వ తేదీ సోమవారం తలపెట్టిన శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ నూరుద్దీన్, కోరారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ శాంతియుత ర్యాలీకి సంబంధి . ంచిన గోడ పత్రికలు,కరపత్రాలను జిల్లాలో ఉన్నటువంటి అన్ని మసీదులకు, మద్రాస, దర్గాలలో, అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముస్లిముల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 15, 16, 24, 25ద్వారా మత సంస్థల స్వేచ్ఛను భంగం కలిగించే విధంగా ఆయా మత ప్రచారాలను, ఆస్తులను కాపాడుకునే బాధ్యత ఆయా మత సంస్థల పెద్దలకు ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి రాజ్యాంగ పరిరక్షకులు, సమైక్యవాదులు, ముస్లిం సోదరులు అందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం కోరారు. కార్యక్రమంలో నెల్లూరు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, మొహమ్మద్ జుబేర్, షేక్ ఖాసిం, షేక్ అహ్మద్ బాషా, షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిఇడి రామకృష్ణారావు తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో పట్టణ నీటి సరఫరా చేసే ఆపరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవికాలం నేపథ్యంలో పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా మరమ్మ తులకు గురైన పైపులను ఎప్పటికప్పుడు మర మ్మతులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి కరిముల్లా ఆపరేటర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు కాలువకు సంబంధించి పూడికతీత పనులను గురువారం చేపట్టారు. ఈ మేరకు ప్రస్తుతం జరుగుతున్న ఈ పనులను పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ పనులు నాణ్యతా ప్రమాణాలతో పాటు రైతులకు ఉపయోగపడేలా చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పరిహారం అందజేత

ప్రజాశక్తి-కోవూరు

:ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగి అనారోగ్య కారణంగా మృతిచెందింది. ఈ మేరకు విషయం తెలుసుకున్న ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వారి కుటుంబానికి కార్పొరేషన్ తరపున రూ. 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు విజయవాడ కార్యాలయంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేసి ఈ సమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జిఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ ఆఫ్ హోమియోపతికి నివాళులు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ఇనమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న హోమియోపతి వైద్యశాలలో గురువారం హోమియోపతి ఫాదర్ ఆఫ్ నేషన్ డాక్టర్ సీఎఫ్ఎస్ హనీమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్, డాక్టర్ సరలా హెప్సీబాలు ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హోమియోపతి సిబ్బంది తదితరులున్నారు.


నినాదాలు చేస్తున్న దృశ్యం

కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కోవూరు

:ఏపీపీటీడీ నేషనల్ మజూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం భోజన విరామం సమయంలో కోవూరు మండలం, పడుగుపాడులోని ఆర్టీసీ జోనల్ పర్క్ షాప్‌లోని కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎం.ఎల్లయ్య మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం తాము నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమానుల్లో మాత్రం ఎటువంటి స్పందన లేదన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మం జూరు చేయాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ఉద్యోగోన్నతులను వెంటనే ఇవ్వాలన్నరు. ముఖ్యంగా ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ వరంగా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎసీ షార్టిన్, డిఐఎన్ రెడ్డి, కె. సుధాకర్‌రావు, కె. రవీంద్ర, భాస్కర్‌రావు, కెఎస్ రావు, డి. దయాకర్, రమణ, తదితర ఉద్యోగులు ఈ నిరసనలో హాజరయ్యారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సీతారామపురం: ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సీతారామపురంలోని పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన గుజ్జుల రత్తమ్మ ఇంట్లో మంటలు చెలరేగి తీవ్ర ఆస్తి నష్టం జరిగిన విషయం విధితమే. అయితే బాధిత కుటుంబానికి భోగినేని గాంధీ లు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాదిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు చేపడతామన్నారు.